కేంద్ర పథకాలను పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సుధీర్‌కుమార్

బాలానగర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తెలుసుకొని వాటిని వినియోగించుకొని లబ్ధి పొందాలని ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం బాలానగర్‌లోని ఎంఎస్‌ఎంఈ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో నూతన పరిశ్రమల స్థాపనకు, కొనసాగుతున్న పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 50 మంది వరకు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

నెక్సస్‌మాల్‌లో క్రిస్మస్ ట్రీ



కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్‌లో క్రిస్టమస్ సంబరాలు ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ అలంకరణతో ఈ మాల్ ఎంతో ఆకట్టుకుంటోంది. మాల్‌లో షాపింగ్ చేసిన వారికి కచ్చితమైన బహుమతులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డిసెంబర్ 25న 'శాంతా కవాతు' జరుగుతుందని అన్నారు. ఈనెల 31వ తేదీ వరకు ఈ క్రిస్మస్ వేడుకలు కొనసాగుతాయని తెలిపారు.

– కూకట్‌పల్లి

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు



సుమిత్రానగర్‌లోని నాగదేవత ఆలయ పూజలో వడ్డేపల్లి రాజేశ్వరరావు



కేపీహెచ్‌బీకాలనీ రోడ్ నం.2లో జరిగిన పూజలో పన్నాల హరీష్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ/కూకట్‌పల్లి: శ్రీసుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకొని సోమవారం సుమిత్రానగర్‌లోని నాగదేవత ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆలయ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. సుబ్రహ్మణ్య స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. పూజలో శ్రీనివాస్, అనిల్ కుమార్,మల్లేష్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ అదే విధంగా కేపీహెచ్‌బీకాలనీ రోడ్ నం.2 లో శ్రీ అభయాంజనేయస్వామివారి ఆలయంలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: పర్యావరణ పరిరక్షణకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని బిపి రాధాకృష్ణన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సెంటర్ ఫర్ ఎర్త్, ఓషన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్ (సీఈఓఏఎస్), స్కూల్ ఆఫ్ ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో 'వాతావరణ మార్పు, క్లీన్ ఎనర్జీ' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులకు మానవ తప్పిదాలే కారణమన్నారు. వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణలో విధాన మార్పులను తీసుకురావడంలో కూడా అందరూ సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌ఆర్‌ఈడీసీఓ) ఇంధనశాఖ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జానయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత, ప్రత్యామ్నాయ ఇంధన వ్యవస్థలు, నికర సున్నా కర్బన ఉద్గారాల గురించి పౌరులకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ డీన్ ప్రొఫెసర్ కేసీ జేమ్స్‌రాజు, సీఈఓఏఎస్ హెడ్ ప్రొఫెసర్ ఎం జయానంద్, సదస్సు కన్వీనర్ డాక్టర్ జి కిషోర్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గ్రంధి కిషోర్‌కుమార్ ప్రసంగించారు.



సదస్సులో మాట్లాడుతున్న వీసీ బీజే రావు

జాగ్రఫీ ప్రొఫెసర్ పదోన్నతి నిలిపివేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ జాగ్రఫీ విభాగం ప్రొఫెసర్‌కు కల్పించిన సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతిని నిలిపివేసినట్లు అధికారులు సోమవారం తెలిపారు. తప్పుడు పత్రాలతో పదోన్నతి పొందినట్లు విచారణలో తేలినందున పాలక మండలి (ఈసీ) సమావేశంలో చర్చించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెప్పారు. సీనియర్ ప్రొఫెసర్ హోదాలో ఇంత కాలం చెల్లించిన వేతనాన్ని రికవరీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కుర్మయ్యగారి దేవేందర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



దేవేందర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఆల్విన్‌కాలనీ: దివంగత మాజీ కౌన్సిలర్ కుర్మయ్యగారి దేవేందర్ 9వ వర్ధంతిని సోమవారం పాపారాయుడు నగర్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ రావు విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌రావు, రాజశేఖర్‌రావు, ప్రవీణ్ రావు, గుండాల సురేష్, వాసు, భరత్, అరుణ్ రావు, పవన్, కొండల్‌రావు, ప్రశాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

కూకట్‌పల్లి: దివంగత మాజీ కౌన్సిలర్ కుర్మయ్యగారి దేవేందర్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. పాపారాయుడునగర్ చౌరస్తాలోని దేవేందర్ విగ్రహానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గృహలక్ష్మి ఉన్నట్టా.. లేనట్టా..?

- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై ఎదురుచూపులు
- బీఆర్‌ఎస్ హయాంలోని లబ్ధిదారుల్లో అయోమయం
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 17,090 దరఖాస్తులు
- ఎన్నికలకు ముందు మంజూరు పత్రాలు జారీ
- మాజీ మంత్రి ఏరియాలోనే 1200 మంజూరు పత్రాలు
- లబ్ధిదారుడికి రూ.3 లక్షలు ప్రకటించిన గత ప్రభుత్వం



గృహలక్ష్మి మంజూరు పత్రాలను అందజేస్తున్న అప్పటి మంత్రి మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: గత ప్రభుత్వం హయాంలోని గృహలక్ష్మి లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. పథకంలో లబ్ధికి గతంలో తీసుకున్న దరఖాస్తులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందా..? లేక ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మళ్లీ స్వీకరిస్తారా..? అలా అయితే ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి, కొందరికి మంజూరు పత్రాలు అందజేసిన చోట ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది. అనే సందేహాలు సంబంధిత వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3 వేల ఇళ్ల చొప్పున మొదటి విడతగా మంజూరు చేస్తామని.. అప్పట్లో దరఖాస్తులు స్వీకరించింది. అంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో దరఖాస్తు చేసుకున్న వారిలో గృహలక్ష్మిపై ఆందోళన నెలకొంది. జిల్లాలో అర్హులను గుర్తించి కొందరికి మంజూరు పత్రాలను కూడా పంపిణీ చేశారు. అయితే బీఆర్‌ఎస్ పాలనలో మొదట్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పథకం అంతగా ముందుకు సాగకపోవడంతో.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 'గృహలక్ష్మి' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో సొంతస్థలం ఉన్నవారికి ఇళ్ల నిర్మాణానికి విడతల వారీగా రూ.3 లక్షల నగదు ఇస్తామని చెప్పి దరఖాస్తులు స్వీకరించింది. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

మేడ్చల్ జిల్లాలో 17,090 దరఖాస్తులు

సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు మంజూరు చేస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించడంతో.. జిల్లాలో చాలా మంది ప్రజలు ముందుకొచ్చి దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి మూడు విడతల్లో రూ.3 లక్షల నగదు సాయం ప్రకటించింది. గడువు తక్కువగా ఉండటంతో కావాల్సిన ధ్రువపత్రాలు పొందడానికి కష్టాలు పడ్డారు. జిల్లాలో మొత్తం 17,090 దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందితో సహా ఇతర సిబ్బంది పరిశీలించారు. వీటిలో కొంత మందిని అర్హులుగా తేల్చి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అప్పటి ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వగా, మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక్క మేడ్చల్ నియోజకవర్గంలోనే 1200 మందికి మంజూరు పత్రాలు అందజేశారు. అంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, మిగిలిన ప్రక్రియ నిలిచిపోయింది. దీనిపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

అయోమయంలో లబ్ధిదారులు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సొంతస్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ప్రకటించింది. స్థలం డాక్యుమెంట్లు కలిగిన ఉన్న వారికే మంజూరు చేస్తామని పేర్కొంది. జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఒక్కో నియోజకవర్గానికి 3,000 వేల ఇళ్ల చొప్పున కేటాయించగా, మొదట్లో 500 చొప్పున 2,500 యూనిట్లు మంజూరు చేసింది. వీటిలో ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ, మైనార్టీలకు 50 శాతం, దివ్యాంగులు 5 శాతం, మిగతావి జనరల్‌కు కేటాయించేలా ఉత్తర్వులు జారీ చేసింది. చాలామంది ప్రభుత్వం కోరిన పత్రాలను సేకరించి కలెక్టరేట్, స్థానిక ఎంపీడీవో, పురపాలక సంఘాల కార్యాలయాల్లో గంటల తరబడి నిరీక్షించి సమర్పించారు. ఇందుకు సంబంధిత పత్రాల కోసం నానా కష్టాలు పడి, క్యూలో గంటల తరబడి నిలబడి మరీ దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకం కింద రూ.5 లక్షలు ప్రకటించింది. సాయం పెంపుపై అంతా హర్షిస్తున్నా.. పాత దరఖాస్తుల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ పథకంలో లబ్ధి చేకూరుస్తారా..? లేక తిరిగి దరఖాస్తులు తీసుకుంటారా..? ఈ విషయమై మళ్లీ ప్రక్రియ మొదలుపెట్టి పూర్తయ్యే వరకు ఎంతకాలం అవుతుందోననే ఆందోళన ఆయా వర్గాల ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తూరు సీతయ్యనగర్‌లో సోమవారం కార్పొరేటర్ సబిహా బేగం రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో అభివృద్ధి పనులను పూర్తి చేసుకోగల్గుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రజాక్, రొయ్యల శివ, మడపతి యోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక

బాలానగర్: జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఇండోర్ స్విమ్మింగ్ పూల్‌లో సోమవారం మెన్ అండ్ ఉమెన్ స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఎంపికైన క్రీడాకారులు జనవరి 2 నుంచి 4 వరకు ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ చెన్నైలో జరిగే సౌత్ వెస్ట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్నారు. ఈ సెలక్షన్‌లో సెక్రటరీ స్పోర్ట్స్ డా. ఎస్‌ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డా. నల్లగొండ అశోక్‌లు పాల్గొన్నారు.

బస్తీల్లో నీటిఎద్దడి నివారణకు చర్యలు

రాంగోపాల్‌పేట్: బస్తీల్లో నీటి ఎద్దడి లేకుండా చూసేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులతో బోర్‌వెల్స్ వేయిస్తున్నామని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. డివిజన్‌లోని మెక్లోడ్‌గూడలోని మైదానం వద్ద కిషన్‌రెడ్డి నిధులతో చేపట్టనున్న బోర్‌వెల్ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గతంలో గాస్మండిలో కూడా బోర్‌వెల్ వేయించామని బస్తీల్లోని ప్రజలకు నీటి సమస్య తలెత్తినపుడు వాడుకునేందుకు ఈ బోర్‌వెల్స్ ఉపయోగపడతాయని చెప్పారు. ఇక్కడే సింటెక్స్ ట్యాంకు ఏర్పాటు చేసి నీరు అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే పీజీ రోడ్డులో జరుగుతున్న మంచినీటి పైప్‌లైన్ మరమ్మతు పనులను ఆమె పరిశీలించి వేగంగా పూర్తి చేయాలన్నారు.

◆ రాణిగంజ్‌లోని ఆదయ్య మెమోరియల్ హైస్కూల్‌లో జరిగిన వికలాంగుల దినోత్సవంలో కార్పొరేటర్ పాల్గొని వారికి క్రీడా పరికరాలను అందించారు. కోమల్, అశ్విని, నిర్మల, ధన్‌రాజ్, సంతోష్, చీర శ్రీనివాస్ పాల్గొన్నారు.

తక్షశిల పాఠశాలలో అడ్వెంచర్ క్యాంప్

లాలాపేట: తక్షశిల హైస్కూల్‌లో సోమవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అడ్వెంచర్ క్యాంప్ జరిగింది. స్కౌట్స్ అండ్‌గైడ్స్ విద్యార్థులు పాఠశాలలో స్వయంగా రోప్ వాక్, క్యాంప్ ఫైర్ వంటి శిబిరాలను ఏర్పాటు చేశారు. దీనికి తెలంగాణ రాష్ట్ర స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ అశోక్ రాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్కౌట్స్ అండ్‌గైడ్స్ అంటే ఎంతో గౌరవంతో పాటు సమాజంలో నిరాడంబరతకు పేరు గాంచిందన్నారు. సేవా కార్యక్రమాల్లో వీరి సేవలు ఎంతో అభినందనీయం అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

సనత్‌నగర్: బాల్యం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. టీటీఐ, హీరో మోటార్స్ సంయుక్తాధ్వర్యంలో 'గీతాంజలి దేవాశ్రయ్' సికింద్రాబాద్ పాఠశాల విద్యార్థులకు రోడ్డుభద్రతా నియమాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు క్రమశిక్షణగా వ్యవహరించాలన్నారు. సిగ్నలింగ్‌ను పాటిస్తూ ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలన్నారు. జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలన్నారు. చిన్నారులు నిబంధనలు పాటిస్తూనే కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలన్నారు.

భళా.. కూచిపూడి, జానపద నృత్యాలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళాలో భాగంగా సోమవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నగరవాసులను అలరించాయి. అనంతపూర్ తోలుబొమ్మలు, కోట, పోచంపల్లి, పట్టోళ్ళ శారీస్, మహేశ్వరం, టెర్రకోట కుండలు తదితర హస్తకళా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా దుబాయ్ నుంచి వచ్చిన కళాకారిణి శ్రావణి తేనేటి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. అలాగే తంజావూర్, కర్ణాటక, మధ్యప్రదేశ్ జానపద నృత్యాలు అలరించాయి.



తెలంగాణ వర్సిటీల కన్వీనర్‌గా జీవన్

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ యూనివర్సిటీ రాష్ట్ర కన్వీనర్‌గా ఓయూ పరిశోధన విద్యార్థి, ఏబీవీపీ నాయకుడు జీవన్ నియమితులయ్యారు. సోమవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ.. నిరంతరం విద్యార్థుల సమస్యల పై పోరాడిన తనను గుర్తించిన జాతీయ నాయకులు ఇటీవల ఢిల్లీలో జరిగిన ఏబీవీపీ 69వ జాతీయ మహాసభలలో కన్వీనర్‌గా నియమించినట్లు పేర్కొన్నారు.

బండారి ప్రకాష్‌గౌడ్ సేవలు చిరస్మరణీయం





బండారి ప్రకాష్‌గౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బండి రమేష్, గొట్టిముక్కల వెంగళరావు, విష్ణువర్ధన్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్‌కు చెందిన దివంగత కాంగ్రెస్ నేత బండారి ప్రకాష్‌గౌడ్ 6వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం బండారి ప్రకాష్‌గౌడ్ చేసిన కృషిని కొనియాడారు. దివంగత పీజేఆర్ అనుచరుడిగా ఎంతో పేరు తెచ్చుకొని ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుష్పారెడ్డి, నవీన్‌గౌడ్, అబ్దుల్ బాకీ, రమేష్, దీపక్, మహేందర్, అనిల్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన గొట్టిముక్కల వెంగళరావు...

కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు, విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం దివంగత బండారి ప్రకాష్‌గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేపు శంకర మఠానికి అయోధ్య రథం

మోతీనగర్: అయోధ్య రామయ్య ప్రతిష్ఠాపన, పట్టాభిషేకం మహోత్సవం సందర్భంగా నదీ జలాలను సేకరించి అయోధ్యకు తీసుకువెళ్లే విధంగా రథాలను ఏర్పాటు చేశారు. ఈ రథం మోతీనగర్‌లోని శంకరమఠానికి ఈనెల20వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు చేరుకోనుంది. ఈ సందర్భంగా మోతీనగర్ పరిసర ప్రాంత భక్తులు శంకరమఠానికి చేరుకొని ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని శంకరమఠం కార్యనిర్వాహణాధికారి సీఎస్ ఆర్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. తమ గోత్ర నామాలతో పూజ చేసుకొని రూ.516 శ్రీరాముడి పట్టాభిషేకానికి సమర్పించాలని నిర్ణయించారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతి పత్రం అందజేత

మోతీనగర్: తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు ఆదేశాల మేరకు వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వడ్డెర నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకులు మారినా వడ్డెర్ల జీవితాలు మాత్రం మారడం లేదన్నారు. గత ముఖ్యమంత్రుల నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరకు వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని పలుమార్లు బహిరంగ సభల్లో ప్రకటించారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పలుమార్లు రాహుల్ గాంధీ వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేరుస్తామని బహిరంగ సభలో ప్రకటించారని తెలిపారు. ఇప్పటికైనా వడ్డెర కులాన్ని బీసీ జాబితా నుంచి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుంచపు వెంకన్న, పిట్ల అంకమ్మరావు, పిట్ల వంశీ, కూకట్‌పల్లి నియోజకవర్గ వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సేవ్ ఏ లైఫ్ ఫౌండేషన్ వార్షికోత్సవం



రాజేశ్వరి వృద్ధాశ్రమంలో అనాథలకు అన్నదానం చేస్తున్న రాణాప్రతాప్

కూకట్‌పల్లి: సేవ్ ఏ లైఫ్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం వివిధ సేవా కార్యక్రమాలు చేశారు. శరత్ సూరగన, సుభాషిణి సూరగన అందజేసిన విరాళంతో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రోడ్లపై ఉన్న అనాథలు, పేదలకు ఉదయం అల్పాహారం, రాజేశ్వరి వృద్ధాశ్రమంలో అన్నదానం, ఫ్యాన్‌లు, ట్యూబ్ లైట్లు విరాళం అందజేశారు. అదే విధంగా మైత్రి హోంలోని అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. జీహెచ్‌ఎంసీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు రాణా ప్రతాప్ సూరగన, తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గూడెపు నాగరాజు

కూకట్‌పల్లి: రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలసిందే. ఈ సందర్భంగా సోమవారం పొన్నం ప్రభార్‌ను కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకుడు గూడెపు నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

అడ్డగుట్ట: రైల్వే పెన్షనర్లకు ఏ సమస్య వచ్చినా సహాయం చేయడానికి దక్షిణ మధ్య రైల్వే సిద్ధమని ప్రిన్సిపల్ సీపీఓ కిషోర్‌బాబు అన్నారు. పెన్షనర్స్ డేను పురస్కరించుకొని సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఆడిటోరియంలో ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పీసీపీఓ కిషోర్ బాబు మాట్లాడుతూ.. రైల్వే పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శేషసాయి మాట్లాడారు. పెన్షనర్ల విషయంలో మార్పులు, దేశంలోని పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘాలన్నీ ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ తెలంగాణ కార్యదర్శి కృష్ణ మోహన్, ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ జాతీయ అధ్యక్షులు సాగరం శ్రీధర్, శివకుమార్, కృష్ణకుమారి పాల్గొన్నారు.

నైట్ షెల్టర్‌లో వైద్యశిబిరం

సనత్‌నగర్: వియ్ ఫర్ ఉమెన్ సంస్థ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బేగంపేటలోని నైట్ షెల్టర్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం వారికి దుప్పట్లు అందజేసి అన్నదానం చేశారు. వియ్ ఫర్ ఉమెన్ వ్యవస్థాపకురాలు గాంధీ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి మాట్లాడుతూ.. తమ సంస్థ ప్రారంభించిన నాటి నుంచి ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామన్నారు. ముఖ్యంగా మహిళా సాధికారత దిశగా తమ సంస్థ అడుగులు వేస్తోందని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలన్నారు. డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ మదన్‌మోహన్, అశ్విని, అభిరామ్ పాల్గొన్నారు.

టైపిస్టు, స్టెనో ఉద్యోగాలను పునరుద్ధరించాలి

లాలాపేట: తెలంగాణ టైపు రైటింగ్, షార్ట్ హాండ్, కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. గత ప్రభుత్వం రద్దు చేసిన టైపిస్టు, స్టెనో ఉద్యోగాలను పునరుద్ధరించాలంటూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మసూద్ అలీ తదితరులున్నారు.

డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సనత్‌నగర్: సనత్‌నగర్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. అశోక్‌కాలనీ జాఫ్రీ మసీదు రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో మునుపెన్నడూ జరగని అభివృద్ధి జరిగిందన్నారు. సమస్య తన దృష్టికి తీసుకురావడమే తడవుగా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపించే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఎమ్మెల్యేగా ఉండడం మనందరి అదృష్టమన్నారు. డివిజన్ పరిధిలో ఎన్నో బృహత్తర ప్రాజెక్టులను ఆయన పూర్తి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ సందీప్, భాస్కర్, సూపర్‌వైజర్ అన్వర్, బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, రాజు, చంద్రారెడ్డి, ఇబ్రహీం, నోమాన్, జమీర్‌బేగ్, అబ్రార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్ పేరిట వసూళ్లు

అమీర్‌పేట: ట్రాఫిక్ జరిమానాలు బకాయి ఉన్నాయంటూ వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ రవిరాజ్ వివరాల ప్రకారం.. ఓల్డ్ కాప్రాలోని శాలివాహన ఎన్‌క్లేవ్‌కు చెందిన శామ్యూల్ విక్టర్ కుమార్ (43) బ్రౌన్‌జాకెట్, ఖాకీ రంగు ప్యాంటు ధరించి గ్రీన్‌ల్యాండ్ కూడలిలో ట్రాఫిక్ జరిమానాల పేరిట డబ్బులు వసూళ్లు చేస్తున్నాడు. పెండింగ్ చలాన్లు చెల్లించాలని చెప్పి తన వద్ద ఉన్న క్యూ ఆర్ కోడ్‌కు జరిమానా మొత్తం చెల్లించుకుంటూ వసూళ్లకు పాల్పడుతున్నాడు. అనుమానం వచ్చిన వాహనదారులు అక్కడి చౌరస్తాలో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించగా అతడు నకిలీ కానిస్టేబుల్‌గా గుర్తించి అరెస్టు చేశారు.